

కుక్కల దాడిలో గాయపడిన చిన్నారులు (ఫైల్)

# గాడితప్పిన పాలన

- లోపించిన పారిశుధ్యం
- డెంగ్యూతో ఒకరు.. పాముకాటుతో మరొకరు మృతి
- కోతులు, కుక్కల దాడులతో బెంబేలు
- వీధుల్లో పందుల స్వైరవిహారం
- రోజురోజుకూ పెరుగుతు డెంగ్యూ కేసులు
- పట్టించుకోని అధికాలు
- ప్రజలకు తప్పని వేదన

ఎల్లారెడ్డిపేట, ఆగస్టు, 20: సర్పంచుల పదవీకాలం పూర్తి కావడంతో గ్రామాల్లో పారిశుధ్యాన్ని పట్టించుకునే నాథుడే కరువయ్యారు. ప్రత్యేకాధికారుల పాలనతో అధికారులు తమ విధుల్లో నిత్యం బిజీగా ఉండడంతో పారిశుధ్యంపై బాధ్యతారాహిత్యం గ్రామాల్లో స్పష్టంగా కనిపిస్తున్నది. చెత్త సేకరణ నుంచి డంప్‌యార్డు వరకు, చెత్తాచెదారం తొలగింపు నుంచి నీటినిల్వ గుంతల గుర్తింపు వరకు నిండా నిర్లక్ష్యం తాండవిస్తోన్నది. కోతులు, కుక్కలదాడులు ప్రజలను భయ భ్రాంతులకు గురిచేస్తున్నది. వీధుల్లో పందులు స్వైరవిహారం చేస్తుండగా, డెంగ్యూ కేసుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతున్నది.

### డెంగ్యూతో ఒకరు, పాముకాటుతో మరొకరు..

నారాయణపూర్‌కు చెందిన తాటిపల్లి శిరీష ప్రసవ సమయంలో కడుపులోని బిడ్డతో పాటు మృతి చెందింది. ప్రసవానికి ముందు రోజు సిద్దిపేటలోని ఓ ప్రైవేట్ దవాఖానలో వైద్య పరీక్షలు చేయగా శిరీషకు డెంగ్యూ పాజిటివ్ అని తేలింది. మెరుగైన వైద్యం కోసం హైదదాబాద్‌కు తరలించే క్రమంలో పరిస్థితి విషమించి మృతిచెందింది. అంతకు ముందు నారాయణపూర్‌లో ఆమె ఉండే కాలనీలో పారిశుధ్యం అధ్వానంగా ఉండగా, ప్రస్తుం సదరు కాలనీ మొత్తం బ్లీచింగ్ చేసి మురుగు కాలువను శుభ్రం చేశారు. వెంకటాపూర్ డబుల్ బెడ్రూం కాలనీకి ఆనుకుని పొదల మధ్య చిత్తారి శంకరమ్మ తన తల్లితో పాటు ఇద్దరు కొడుకులు అఖిల్, లక్కీతో ఓ చిన్న గుడిసెలో ఉండేవారు. చిన్నారి అఖిల్ పాముకాటుకు గురై వరంగల్ ఎంజీఎం దవాఖానలో మృతి చెందిన ఘటన వారం క్రితం జరిగింది.

### పందులు, వీధికుక్కల స్వైరవిహారం

గ్రామాల్లో వీధికుక్కలు, కోతులు స్వైరవిహారం చేస్తూ ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. ముఖ్యంగా చిన్నారులపై దాడులు చేస్తుండడంతో కొన్ని కాలనీల్లో ప్రజలు బిక్కుబిక్కుమంటూ బయటికి వెళ్తున్నారు. ఇటీవల మండల కేంద్రంలో ఏకంగా ఏడుగురు చిన్నారులపై కుక్కలు దాడి చేయగా, వారు సిరిసిల్ల ఏరియా దవాఖానలో చికిత్స చేయించుకున్నారు. అలాగే పదుల సంఖ్యలో కోతులు తలుపులు తోసుకుని ఇంట్లోని సామగ్రిని చిందరవందర చేస్తూ ఇబ్బందులకు గురి చేస్తున్నాయి. పందులు వీధుల్లో స్వైర విహారం చేయడంతో పరిసరాలు అపరిశుభ్రంగా మారుతున్నాయి. గ్రామ పంచాయతీల్లో ఫిర్యాదు చేసినా పట్టించుకునే వారు లేకుండాపోయింది.

### ఇబ్బంది పడుతున్నం



మాది నారాయణపూర్. మా కాలనీలోని మురుగు కాలువల్లో పేరుకుపోయిన చెత్తను సరిగ్గ తీయడం లేదు. దీంతో దోమలు బాగా వస్తున్నయ్. నా కూతు రు గ్రేసికి జ్వరం రావడంతో సిరిసిల్ల దవాఖానకు తీసుకెళ్తే రూ.30వేలు ఖర్చు అయినయ్. కూలీ చేసుకుని బతికేవాళ్లం. ఇంటి ముందట పందులు గలీజ్ చేస్తున్నయ్. అవి రాకుండా చూడాలని చెబితే ఎవరూ పట్టించుకుంట లేదు. పందులతోటి ఇబ్బందిఅయితాంది.

*- ఆకారం రాజు-సౌందర్య*



నారాయణపూర్‌లో ఇండ్ల సముదాయంలో పందుల విహారం



వెంకటాపూర్ డబుల్ బెడ్రూం ఇండ్ల రోడ్డు నుంచి రోడ్డుపైకి వస్తున్న మురుగునీరు

## కొనసాగుతున్న ఎత్తిపోతలు

ఇల్లంతకుంట, ఆగస్టు 20: అనంతగిరి శివారులోని అన్నపూర్ణ ప్రాజెక్టుకు బహుబలి మోటార్ల ద్వారా ప్రతిరోజూ 6,440క్యూసెక్కుల నీటిని ఎత్తిపోస్తున్నామని ప్రాజెక్టు ఏఈ సమరసేన తెలిపారు. శ్రీ రాజరాజేశ్వర జలాశయం (మిడ్‌మానేరు) నుంచి గ్రావిటీ కెనాల్ ద్వారా తిప్పాపూర్ పంప్‌హౌస్‌లోకి గోదావరి జలాలు తరలిరాగా, బహుబలి మోటార్ల ద్వారా అన్నపూర్ణలోకి ఎత్తిపోస్తున్నట్టు చెప్పారు. ప్రాజెక్టులో ప్రస్తుతం 1.25టీఎంసీలు నిల్వ ఉండగా, సిద్దిపేట జిల్లాలోని రంగనాయక సాగర్‌కు గ్రావిటీ కెనాల్ నీటిని విడుదల చేసినట్టు వెల్లడించారు.

### ఎస్సారార్‌లో 16.19టీఎంసీలు నిల్వ

బోయినపల్లి, ఆగస్టు 20: మాన్వాడ శ్రీ రాజరాజేశ్వర జలాశయంలో 27.54 టీఎంసీల సామర్థ్యానికి గానూ మంగళవారం 16.19టీఎంసీలు నిల్వ ఉన్నట్టు ఇంజినీరింగ్ అధికారులు తెలిపారు. కరీంనగర్ జిల్లా రామడుగు మండలం లక్ష్మీపూర్ గాయత్రి పంప్‌హౌస్ నుంచి వరద కాలువ ద్వారా 5,261 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా, 3,410 క్యూసెక్కుల అవుట్‌ఫ్లో వెళ్తున్నట్టు వారు చెప్పారు.

















